క్లుప్తంగా

నేడు 'గడప గడపకూ మన ప్రభుత్వం'

ఎన్పీకుంట: మండల పరిధిలోని ధనియానిచెరువు సచివాలయం పరిధిలో సోమవారం మధ్యాహ్నం 3 గంటలకు ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీపీ ఈటె రాము, ఎంపీడీఓ ఆదినారాయణ తెలిపారు. గోవిందురాజులపల్లి నుంచి ప్రారంభమయ్యే కార్యక్రమానికి జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీలు, ఎంపీటీసీలు, సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు, అధికారులు, సచివాలయ కన్వీనర్లు, వలంటీర్లు పాల్గొనాలని కోరారు.

అక్రమ మద్యం స్వాధీనం



స్వాధీనం చేసుకున్న మద్యాన్ని చూపుతున్న వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం

ధర్మవరం అర్బన్: అక్రమంగా మద్యాన్ని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసి, వారి నుంచి మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నట్లు వన్‌టౌన్ సీఐ సుబ్రహ్మణ్యం ఆదివారం తెలిపారు. వివరాలు.. పట్టణంలోని పార్థసారధి నగర్‌లో ఉన్న సాయిబాబా ఆలయం సమీపంలో పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. మోటర్ సైకిల్‌లో అక్రమంగా మద్యం రవాణా చేస్తున్న చిగిచెర్ల గ్రామానికి చెందిన దళవాయి కుళ్లాయప్ప, జిన్నే వెంకటేష్‌ను అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 40 ఆంధ్ర మద్యం బాటిళ్లు, ఒక మోటర్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. అక్రమంగా మద్యం రవాణా చేసినా, గంజాయి అమ్మినా, మట్కా, పేకాట ఆడినా కఠిన చర్యలు తీసుకుంటామని పోలీసులు హెచ్చరించారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ జాకీర్ హుసేన్, కానిస్టేబుళ్లు ఉమాశంకర్, రాజప్ప, నరసింహులు పాల్గొన్నారు.

రికార్డుల పరిశీలన

అమడగూరు: స్థానిక స్టేషన్‌ను సీఐ నిరంజన్ రెడ్డి ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను క్షుణ్ణంగా తనిఖీ చేశారు.ఎస్ఐ వెంకటనారాయణను అడిగి పెండింగ్‌లో ఉన్న కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. మండలం కర్ణాటక బార్డర్ ప్రాంతంలో ఉండటంతో కర్ణాటక మద్యం సరఫరా కాకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. సాధ్యమైనంత వరకూ లోక్ అదాలత్‌లో కేసులు పరిష్కారమయ్యేలా చూడాలన్నారు. కార్యక్రమంలో జమేదారు సుధాకర్, సిబ్బంది పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అదాలత్

పుట్టపర్తి టౌన్: కదిరి పట్టణంలోని విద్యుత్ కార్యాలయంలో ఈనెల 24న ఉదయం 11:30 నుంచి మధ్యాహ్నం 1:30 వరకూ విద్యుత్ సమస్యలపై ప్రత్యేక అదాలత్ నిర్వహిస్తున్నట్లు ట్రాన్స్‌కో ఈఈ జె.మోసెస్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం కదిరి డివిజన్ పరిధిలోని మండలాలకు సంబంధించిన ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నామన్నారు. ఈ అవకాశాన్ని విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు

రామగిరి: మండలంలోని నసనకోట సమీపంలోని ముత్యాలమ్మ ఆలయంలో ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయాన్నే అమ్మవారిని ప్రత్యేకంగా పూలతో అలంకరించారు. పూజలకు ఉమ్మడి అనంతపురం జిల్లా వాసులేకాక కర్ణాటక నుంచి తరలివచ్చి, మొక్కులు తీర్చుకున్నారు. ఆలయంలో ప్రతి శుక్ర, మంగళ, ఆదివారాల్లో దేవదాయశాఖ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు ఈఓ వెంకటేశ్వర్లు తెలిపారు.

వడ్డెర సంక్షేమ సంఘం నూతన కమిటీ ఎన్నిక



మాట్లాడుతున్న మండల వడ్డెర సంక్షేమ సంఘం నూతన అధ్యక్షుడు కిష్టప్ప

తనకల్లు: స్థానిక చౌడేశ్వరీ దేవాలయంలో మండల వడ్డెర సంక్షేమ సంఘం నూతన కమిటీని ఆదివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. గౌరవ అధ్యక్షుడిగా బేల్దారి కిష్టన్న, మండల అధ్యక్షుడిగా ఈతోడుకు చెందిన కిష్టప్ప, ప్రధాన కార్యదర్శిగా జయరాజ్, ఉపాధ్యక్షులుగా రవిచంద్ర, డీ. శ్రీనివాసులు, కిష్టప్ప, చలపతి, శ్రీనివాసులు, గౌరవ సలహాదారులుగా వడ్డే భాస్కర్, చిన్న రెడ్డెప్ప, ఓబులేసు, పూజారి నారాయణప్ప, విశ్వనాథ్, కే.శ్రీనివాసులు, జనరల్ సెక్రటరీలుగా మధు, చంద్రాయుడు, రామాంజినేయులు, కే.అంజినప్పను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతన కమిటీ సభ్యులు మాట్లాడుతూ.. వడ్డెర్లు ఐక్యమత్యంగా ఉంటేనే సమస్యలు పరిష్కారం అవుతాయన్నారు. వడ్డెర్లు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

జగనన్నకే మా మద్దతు



ఈ ఫొటోలో కనిపిస్తున్న మహిళ పేరు ఈరాతి లక్ష్మీనరసమ్మ. నల్లమాడ మండలంలోని రెడ్డిపల్లి గ్రామం. ఈమె కుటుంబానికి ఉచిత ఇంటి స్థలం, వైఎస్సార్ పింఛన్ కానుక ద్వారా రూ.82 వేలు, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.40,500, వైఎస్సార్ పంటల బీమా ద్వారా రూ.17,987, వైఎస్సార్ ఆసరా కింద రూ.15,416, వైఎస్సార్ సున్నా వడ్డీ (రైతులు) రూ.943, వైఎస్సార్ సున్నా వడ్డీ (డ్వాక్రా) ద్వారా రూ.3,895 చొప్పున లబ్ధి చేకూరింది. గతంలో ఇలాంటి పథకాలు అందించిన దాఖలాలు లేవని లక్ష్మీనరసమ్మ తెలిపింది. జగనన్న మాకు ఎంతో మేలు చేశారు. ఆయనకు జీవితాంతం రుణపడి ఉంటామని పేర్కొంది.



ఈ ఫొటోలో ఉన్న మహిళ పేరు నాన బాల భవాని. రెడ్డిపల్లి గ్రామం. ఈమె కుటుంబానికి జగనన్న విద్యా దీవెన పథకం కింద రూ.98,600, జగనన్న వసతి దీవెన ద్వారా రూ.31,242, వైఎస్సార్ రైతు భరోసా కింద రూ.40,500, వైఎస్సార్ చేయూత కింద రూ.18,750, వైఎస్సార్ ఆసరా ద్వారా రూ.15,160, వైఎస్సార్ పంటల బీమా కింద రూ.12,868, వైఎస్సార్ సున్నా వడ్డీ (రైతులు) రూ.5,209, వైఎస్సార్ సున్నా వడ్డీ (డ్వాక్రా) రూ.4,077 చొప్పున ప్రభుత్వం నుంచి లబ్ధి చేకూరింది. మా కుటుంబాన్ని ఆర్థికంగా ఆదుకున్న సీఎంకు అండగా ఉంటామని భవాని తెలిపింది. సీఎం జగన్ ఎన్నటికీ మర్చిపోమని, మళ్లీ ఆయన్నే ముఖ్యమంత్రి చేసుకుంటామని చెబుతోంది.

- హామీలన్నీ నెరవేరుస్తున్నారు..
- ఆయన్ను మరోసారి సీఎంగా గెలిపించుకుంటాం
- 'గడప గడపకూ మన ప్రభుత్వం'లో లబ్ధిదారుల హర్షం



మహిళకు సంక్షేమ పథకాలను వివరిస్తున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

నల్లమాడ: గతంలో ఎన్నడూ లేని విధంగా పథకాలు అందిస్తున్న వైఎస్ జగన్‌మోహన్ రెడ్డికి ఎల్లప్పుడూ మా మద్దతు ఉంటుందని లబ్ధిదారులు స్పష్టం చేశారు. మరోసారి సీఎంగా గెలిపించుకుంటామని తెలిపారు. రెడ్డిపల్లి గ్రామ సచివాలయం పరిధిలోని రెడ్డిపల్లి, రెడ్డికుంట తండా గ్రామాల్లో ఆదివారం ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. తొలుత ఆయా గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలు, ప్రజలు ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డికి ఘనంగా స్వాగతం పలికారు. పూలవర్షం కురిపించి, మహిళలు హారతులిచ్చి స్వాగతించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల బుక్‌లెట్లను అందజేశారు. సంక్షేమ పథకాల వల్ల ఒక్కో కుటుంబానికి చేకూరిన లబ్ధిని వివరించారు. ప్రజలు ఏవైనా సమస్యలు తెలియజేయాలని కోరారు. తక్షణం వాటి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం శ్రమిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి అండగా నిలవాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో ఆర్థిక ఇబ్బందులు ఉన్నా సంక్షేమ పథకాలు కొనసాగిస్తున్న ఘనత సీఎం వైఎస్ జగన్‌కే దక్కుతుందన్నారు. ఎన్నికల సమయంలో టీడీపీ నాయకులు చెప్పే కల్లిబొల్లి మాటలు నమ్మి మోసపోవద్దని సూచించారు. 2014 ఎన్నికల్లో లెక్కలేనన్ని అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన చంద్రబాబు ఏ ఒక్క హామీ నెరవేర్చలేదని మండిపడ్డారు. ప్రజలందరినీ మోసగించారని ఆరోపించారు. సీఎం జగనన్న పాదయాత్రలో ప్రజలకు ఇచ్చిన హామీలను మూడేళ్లలోనే 95 శాతం నెరవేర్చారని గుర్తు చేశారు. పలువురు లబ్ధిదారులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందిస్తున్నారన్నారు. పేదల అవసరాలను గుర్తించి ఏదో ఒక సంక్షేమ పథకం ద్వారా ఎప్పటికప్పుడు ఆదుకుంటున్నారని ఎమ్మెల్యేతో సంతోషం పంచుకున్నారు. జగనన్నకు ఎప్పుడూ మేం అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ దేవేంద్రనాయక్, ఎంపీడీఓ రామచంద్రారెడ్డి, పంచాయతీ కార్యదర్శి సూర్యచంద్రారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రామచంద్రారెడ్డి, వైస్ ఎంపీపీ కే.సూర్యనారాయణ, సర్పంచ్ ప్రసాద్, సహకార సంఘం అధ్యక్షుడు ఏ.గంగిరెడ్డి, వ్యవసాయ సలహా బోర్డు చైర్మన్ రఘునాథరెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, పార్టీ నాయకులు అంజినాయక్, ఈరాతి నాగప్ప, చంద్రశేఖర్, శేషాద్రిరెడ్డి, షరీఫ్, బాబావలి, దస్తగిరి, వెంకటేష్ నాయక్, యర్ర సూరి, గోపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ బలోపేతానికి కృషి చేద్దాం



రామగిరిలో ముత్యాలప్ప కుటుంబాన్ని పరామర్శిస్తున్న తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి

రామగిరి: వైఎస్సార్‌సీపీని మరింత బలోపేతం చేసేందుకు అందరం కలిసికట్టుగా కృషి చేద్దామని పార్టీ సీనియర్ నాయకుడు తోపుదుర్తి చంద్రశేఖర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని మాదాపురం, నసనకోట, రామగిరి గ్రామాల్లో ఆయన పర్యటించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మూడు దశాబ్దాలుగా పరిటాల కుటుంబం మంత్రులు, ఎంఎల్ఏలుగా కొనసాగినా (పెనుకొండ, రాప్తాడు) ఎలాంటి అభివృద్ధి చెందలేదన్నారు. పేదలను పీడించి, డబ్బు దోచుకొని దాచుకోవడమే పనిగా పెట్టుకున్నారని, జిల్లాలో పేరుగాంచిన ముత్యాలమ్మ ఆలయం సొమ్ము కూడా వదల్లేదన్నారు. రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలతోపాటు ఇవ్వని వాటిని కూడా నెరవేర్చారన్నారు. ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి చొరవతో పేరూరు డ్యాంకు నీరు ఇచ్చినట్లు తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని చెరువులను హంద్రీనీవా నీటితో నింపడంతో పాటు, ముత్యాలమ్మ ఆలయాన్ని దేవదాయశాఖ పరిధిలోకి తీసుకువచ్చినట్లు తెలిపారు. త్వరలోనే మహిళలకు సహకార డెయిరీని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. రామగిరి బంగారు గనులు కూడా తెరిపిస్తున్నట్లు తెలిపారు. రామగిరిలో తీవ్ర అనారోగ్యంతో మృతి చెందిన హరిజన ముత్యాలప్ప కుటుంబాన్ని పరామర్శించి, ఆ కుటుంబానికి ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో ఎంపీపీ కర్రెన్న, జెడ్పీటీసీ నాగార్జున, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రమేష్, సర్పంచ్ మీనుగనాగరాజు, నాయకులు నరసింహారెడ్డి, కురుబ ముత్యాలప్ప, రామాంజనేయులు, బోయ నాగేంద్ర, వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు.

బీసీ కార్పొరేషన్ల కొనసాగింపుపై హర్షం



ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని సన్మానించిన బీసీ సంఘాల నాయకులు

నల్లమాడ: 55 బీసీ కార్పొరేషన్లలో చైర్మెన్లు, డైరెక్టర్ల పదవీకాలం పొడిగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకోవడంపై ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నాయకులు హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని ఆయా వర్గాల నాయకులు ఆదివారం రెడ్డికుంట తండాలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డిని కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు ఎస్.రామచంద్రారెడ్డిని తలపాగాతో సన్మానించారు. పలువురు నాయకులు మాట్లాడుతూ.. బీసీ కార్పొరేషన్ల కాల పరిమితిని పొడిగిస్తూ ఆయా కార్పొరేషన్ల చైర్మెన్లు, డైరెక్టర్‌లను కొనసాగించడం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీల పట్ల ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు ఉన్న చిత్తశుద్ధికి నిదర్శనమన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కుళ్లాయినాయక్, వేళ్లమద్ది, రెడ్డిపల్లి పంచాయతీల సర్పంచులు బొజ్జేనాయక్, ప్రసాద్, దొన్నికోట బీసీ నాయకులు నాగరాజునాయుడు, అశ్వర్థనాయుడు, చిన్నరాము, ఎస్సీ నాయకులు బొప్పోళ్ల నారాయణ తదిరులు పాల్గొన్నారు.

ఓంకారేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

బత్తలపల్లి: మండల కేంద్రంలోని లలితా త్రిపుర సుందరీ సమేతా ఓంకారేశ్వర స్వామి ఆలయ నాలుగో వార్షికోత్సవ వేడుకలను ఆదివారం వైభవంగా నిర్వహించారు. ఆదివారం తెల్లవారుజామున గంగపూజ, గణపతి పూజ అనంతరం స్వామికి అభిషేకాలు చేపట్టారు. పుణ్యాహవచనం, రుత్విక్ వరణం, పంచగవ్యప్రాశన, నవగ్రహ ఆరాధన, అంకురార్పణ, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం తదితర పూజలను వేదపండితులు బాలాజీశర్మ, గరుడాద్రి సురేష్‌శర్మ, సాయి బార్గవ్‌శర్మ, హరినాథశర్మ ఆధ్వర్యంలో నిర్వహించారు. సాయంత్రం గణపతి, నవగ్రహ, ధన్వంతరీ, మృత్యుంజయ హోమాలు చేశారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త కోటి సూర్యప్రకాష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు కోటి సుధ, ఉప సర్పంచ్ కోటి గోపీనాథ్, ఎంపీటీసీ సభ్యులు కోటి నరేష్, సచివాలయ కన్వీనర్ జయరామిరెడ్డి, బండి వీరనారప్ప, యోగానందాచారి పాల్గొన్నారు.

పదేళ్ల తర్వాత ఇంటికొచ్చాడు



అఖిల్ కుమార్

ముదిగుబ్బ: మండల పరిధిలోని నాగారెడ్డిపల్లికి చెందిన బి.సూర్యనారాయణ కుమారుడు అఖిల్‌కుమార్ పదేళ్ల తర్వాత ఇంటికి చేరుకున్నాడు. వివరాలు.. సూర్యనారాయణ, తన భార్య శోభారాణి, ఒక కుమారుడు, ఒక కుమార్తెతో కలసి పదేళ్ల క్రితం జీవనోపాధి కోసం హైదరాబాద్ వెళ్లారు. అక్కడ అరటి పళ్ల వ్యాపారం చేసుకుంటూ జీవనం సాగించేవారు. అఖిల్ కుమార్ పదో తరగతి చదువుతున్న సమయంలో పాఠశాలకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్, ముదిగుబ్బ, ఇతర బంధువుల గ్రామాల్లో గాలించినా ఫలితం లేకపోయింది. ఈ నేపథ్యంలో కుమారుడు తప్పిపోయిన బాధతో తల్లిదండ్రులు గ్రామానికి వచ్చారు. ఇదిలా ఉండగా ఆదివారం సాయంత్రం అఖిల్ కుమార్ నాగారెడ్డిపల్లిలోని తల్లిదండ్రుల వద్దకు చేరుకున్నాడు. కుమారుడిని చూసిన తల్లిదండ్రులు సంతోషంలో మునిగిపోయారు. ఎలా ఉన్నావు నాన్నా? ఇన్ని రోజులు ఎక్కడ ఉన్నావంటూ ఆప్యాయంగా దగ్గరికి తీసుకున్నారు.

నేడు 'స్పందన'

కనగానపల్లి: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామని తహసీల్దార్ పీవీ రమణ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి జరిగే కార్యక్రమంలో మండల స్థాయి అధికారులంతా హాజరై ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులను స్వీకరించాలన్నారు.

తాడిమర్రి: మండలంలోని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ నాగరాజు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు.

బత్తలపల్లి: మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల్లో సోమవారం స్పందన కార్యక్రమం ఉంటుందని తహసీల్దార్ యుగేశ్వరిదేవి తెలిపారు. 11 గ్రామ సచివాలయాల్లో సచివాలయ ఉద్యోగులు ప్రజల నుంచి అర్జీలను స్వీకరిస్తారన్నారు. ప్రజలు సమస్యలపై వినపత్రాలు అందజేయాలన్నారు.

ఎమ్మెల్యేను కలసిన బీసీ కార్పొరేషన్ల డైరెక్టర్లు

కదిరి టౌన్: రాష్ట్ర వ్యాప్తంగా 55 బీసీ కార్పొరేషన్ల చైర్మెన్లు, డైరెక్టర్ల పదవీకాలన్ని పొడిగించడంతో ఆదివారం ఎమ్మెల్యే డాక్టర్ పీవీ సిద్దారెడ్డిని ఆయన కార్యాలయంలో బీసీ కార్పొరేషన్ డైరెక్టర్లు ఆదివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఎమ్మెల్యేను దుశ్శాలువాతో సన్మానించారు. పదవీ కాలాన్ని రెండు సంవత్సరాల పాటు కొనసాగించినందుకు ముఖ్యమంత్రి జగన్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సీఎం మేలు మరువలేమని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆయా కార్పొరేషన్ల డైరెక్టర్లు జక్కల వినీత లక్ష్మి, గౌరీదేవి, చంద్రశేఖర్ ఆచారి, భాగ్యమ్మ, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

డ్రైవింగ్ లైసెన్స్, ఇన్సూరెన్స్ తప్పనిసరి



సూచనలిస్తున్న ఎస్ఐ నరసింహుడు

పుట్టపర్తి: ఆటో డ్రైవర్లు, ఇతర వాహనదారులకు డ్రైవింగ్ లైసెన్స్‌తో పాటు ఇన్సూరెన్స్ తప్పనిసరి అని బుక్కపట్నం ఎస్ఐ నరసింహుడు అన్నారు. ఆదివారం రోడ్డు భద్రతా వారోత్సవాల్లో భాగంగా బుక్కపట్నం బస్టాండ్‌లో ఆటో డ్రైవర్లకు అవగాహన కల్పించారు. ప్రతి ఒక్కరూ డ్రైవింగ్ లైసెన్సుతో పాటు అన్ని రికార్డులు కలిగి ఉండాలన్నారు. అధిక లోడుతో వాహనాలు నడపొద్దని హెచ్చరించారు. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు నష్టపరిహారం అందాలంటే ఇన్సూరెన్స్ తప్పనిసరిగా చేయించుకోవాలన్నారు.

కాలభైరవుడి ఆలయంలో అమావాస్య పూజలు



దీపాలు వెలిగిస్తున్న భక్తులు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని లక్ష్మీచక్రవర్తి థియేటర్ సమీపంలోని కాలభైరవ స్వామి ఆలయంలో రెండు రోజు అమావాస్య పూజలు ఘనంగా నిర్వహించారు. పూజారి ధనుంజయ ఆచారి కాలభైరవ స్వామిని ప్రత్యేకంగా అలంకరించి, కూష్మాండ దీపోత్సవం చేపట్టారు. భక్తులు అమావాస్య గడియల్లో కూష్మాండ దీపోత్సవాన్ని వెలిగించారు. భక్తులు గుమ్మడికాయలతో మొక్కులు చెల్లించుకున్నారు. అనంతరం స్వామి కంకణాలను భక్తులకు కట్టారు.

భక్తిశ్రద్ధలతో మాఘమాస పూజలు



విశేష పూజలందుకుంటున్న లక్ష్మీ వేంకటేశ్వరుడు

బత్తలపల్లి: మకర సంక్రాంతి పండుగ అనంతరం వచ్చే అమావాస్య తరువాత మాఘమాసం ప్రారంభమవుతుంది. మాఘ మాసం రాగానే మహిళలు ఉదయమే మాఘస్నానాలు ఆచరించి తడిగుడ్డలతో దేవాలయాలకు వెళ్లి పూజలు నిర్వహించారు. ఆదివారం మండలంలోని పలు గ్రామాల్లోని దేవాలయాలలో దీపాలు వెలిగించి ప్రదక్షిణలు చేశారు. మొదటి ఆదివారం నుంచి ప్రతి ఆదివారం ఇంటిలో శుభ్రతను ఆచరించి దేవాలయాల వద్ద, కోనేరు వద్ద పాలు పొంగులు చేపడతారు. తద్వారా అశ్వర్థ నారాయణస్వామి కరుణాకటాక్షలు పొందుతారన్న నమ్మకం. అదేవిధంగా శివునికి కూడా అత్యంత ప్రీతికరమైన మాసమని శివభక్తులు చెబుతున్నారు. మాఘ మాసం కావడం వల్ల పోట్లమర్రి, ముష్టూరు శివాలయంలు, గంటాపురం అప్పస్వామి, దంపెట్ల చెన్నకేశవాలయం, డి.చెర్లోపల్లి సిద్దేశ్వరాలయం, మాల్యవంతం, రామాపురం, కోడేకండ్ల వీరనారాయణస్వామి దేవాలయాలు, సంజీవపురం కాటికోటేశ్వర క్షేత్రం, సంఘమేశ్వర క్షేత్రంలో భక్తుల సందడి నెలకొంది. సంఘమేశ్వరంలో సతీసమేతంగా నవగ్రహాలు ఉండటంతో అక్కడ పూజలు నిర్వహించారు.

జిల్లాస్థాయి కరాటే పోటీల్లో సత్తా



మెడల్స్ చూపుతున్న క్రీడాకారులు

ధర్మవరం: జిల్లాస్థాయి కరాటే పోటీల్లో ధర్మవరం విద్యార్థులు ప్రతిభ చూపారని ధర్మవరం మల్టీస్టార్ బుడోకాన్ కరాటే అకాడమీ మాస్టర్ ఇనాయత్‌బాషా తెలిపారు. ఈనెల 21వ తేదీన హిందూపురంలోని ఎంజీఎం స్కూల్ ఆవరణలో స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ కార్యదర్శి అంజన్న ఆధ్వర్యంలో జిల్లాస్థాయి కరాటే పోటీలు నిర్వహించారు. అండర్-14 బాలికల విభాగంలో హర్షిణి, అంజలి, శిరీష సత్తా చాటారు. అండర్-14 బాలుర విభాగంలో మోహన్, సుశాంత్, పాలెం, మోక్షిత్ కుమార్, అజయ్‌కుమార్ ప్రతిభ కనబరిచారు. అండర్-19 విభాగంలో రియాజ్ అహ్మద్ గోల్డ్‌మెడల్ సాధించాడని తెలిపారు. ఈనెల 29వ తేదీన ఒంగోలులో జరగబోయే రాష్ట్రస్థాయి కరాటే పోటీల్లో వీరు పాల్గొంటారు.

రోడ్డు ప్రమాదంలో దంపతులకు గాయాలు



జాతీయ రహదారిపై ప్రమాదానికి గురైన కారు

కనగానపల్లి: ముక్తాపురం సమీపంలో 44వ నెంబరు జాతీయ రహదారిపై జరిగిన రోడ్డు ప్రమాదంలో దంపతులు గాయపడ్డారు. స్థానికులు తెలిపిన మేరకు.. అనంతపురం నగరానికి చెందిన విశ్రాంత ఎస్ఐ పుజారి జనార్ధన తన భార్య లీలావతితో కలసి ఆదివారం మధ్యాహ్నం కర్ణాటకలోని నాగులమడక నుంచి అనంతపురానికి కారులో బయల్దేరారు. జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న మరో వాహనం అడ్డు వచ్చింది. వాహనాన్ని తప్పించబోయి కారును పక్కకు తిప్పటంతో రహదారి పక్కనే ఉన్న దిమ్మెను ఢీకొట్టి బోల్తాపడింది. ఈ ప్రమాదంలో కారు నడుపుతున్న జనార్దన్‌తో పాటు అతని భార్య గాయపడ్డారు. స్థానికులు వెంటనే హైవే పెట్రోలింగ్ వాహనం ద్వారా క్షతగాత్రులను అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. కనగానపల్లి పోలీసులు కేసు నమోదు చేసుకున్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు ఎంపిక

ధర్మవరం అర్బన్: రాష్ట్రస్థాయి కబడ్డీ క్రీడా పోటీలకు ధర్మవరం క్రీడాకారులు ఎంపికైనట్లు కబడ్డీ కోచ్ పృథ్వీ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. శనివారం బత్తలపల్లి ఆర్డీటీ క్రీడా మైదానంలో ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు ఎంపికకు కబడ్డీ పోటీలు నిర్వహించారు. క్రీడాకారులు ఉష, శ్రీనివాసులు, రాజు, మణిదీప్, తానియా ప్రతిభ కనబరిచి, రాష్ట్రస్థాయి క్రీడా పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈనెల 25వ తేదీ నుంచి 27వ తేదీ వరకూ విశాఖపట్నం అరకుపాలెంలో జరిగబోయే 70వ సీనియర్ కబడ్డీ క్రీడా పోటీల్లో వీరు పాల్గొంటారన్నారు. ప్రతిభ కనబరిచిన క్రీడాకారులను ఆర్డీటీ ఆర్డీ ప్రమీల, ఏటీఎల్ శ్రీనివాసులు, కోచ్ అనిల్, రాజశేఖర్ అభినందించారు.

హంద్రీనీవా కాలువ పరిశీలన



వివరాలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే సిద్దారెడ్డి

తలుపుల: మండలంలోని ఏపులపల్లి టన్నెల్ సమీపంలోని హంద్రీనీవా కాలువను వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఎమ్మెల్యే సిద్దారెడ్డి ఆదివారం పరిశీలించారు. హంద్రీనీవా కాలువలో ఎక్కడెక్కడ నీరు పోవడానికి అడ్డంకులున్నాయో ఆరా తీశారు. నాలుగైదు రోజుల్లో కాలువకు అడ్డంగా వుండే రాళ్ళు, దిన్నెలు, చెట్లు పూర్తిగా తొలగించేలా చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు కుర్లిశివారెడ్డి, ఈశ్వర్‌రెడ్డి, వెంకటరమణారెడ్డి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



మంత్రికి సత్యసాయి చిత్రపటాన్ని బహూకరిస్తున్న వివిధ సంఘాల నాయకులు

పుట్టపర్తి టౌన్: జిల్లా కేంద్రం పుట్టపర్తి పర్యటనకు విచ్చేసిన కేంద్ర సమాచార శాఖ సహాయ మంత్రి దేవాన్స్ చౌహాన్‌ను సాయి ఆరామంలో పలు సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. జర్నలిస్ట్ సమస్యలు పరిష్కరించాలని కోరారు. తమకు రాజకీయ ప్రాధాన్యం కల్పించాలని బెస్త కులస్తులు విన్నవించారు. అలాగే అంబాడి హక్కుల పోరాటసమితి ఆధ్వర్యంలో నాయకులు సమస్యలు పరిష్కరించాలంటూ వినతిపత్రాలు అందజేశారు. అనంతరం మంత్రికి సత్యసాయిబాబా చిత్రపటాన్ని బహూకరించారు.